సాక్షి
కాకినాడ
బుధవారం । 20 । సెప్టెంబర్ । 2023



నిత్యాన్నదానానికి విరాళం


అన్నవరం: సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి సీహెచ్ నరేష్‌బాజీ, వినీత దంపతులు మంగళవారం రూ.1,11,000 విరాళం సమర్పించారు.



అన్నదాన భవనానికి విరాళం

ఆత్రేయపురం: వాడపల్లి వేంకటేశ్వరస్వామి క్షేత్రంలో నిత్యాన్నదాన భవన నిర్మాణానికి మళ్ల వెంకట బినర్జీ, నాగసత్య దంపతులు (అనకాపల్లి) మంగళవారం రూ.50 వేల విరాళం సమర్పించారు.

డెల్టాలకు నీరు విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి మంగళవారం గోదావరి తూర్పు డెల్టాకు 3,800, మధ్య డెల్టాకు 2,400, పశ్చిమ డెల్టాకు 7 వేల క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేశారు. సముద్రంలోకి 4,90945 క్యూసెక్కుల మిగుల జలాలను విడిచిపెట్టారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.20 అడుగులకు చేరింది.

న్యూస్‌రీల్

అక్టోబరులో ఈవీఎంల పరిశీలన



అంబేడ్కర్ భవన్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా

కాకినాడ సిటీ: జిల్లాకు కొత్తగా వచ్చిన ఈవీఎం, వీవీప్యాట్స్‌ల పనితీరును బెల్ ఇంజనీర్లతో కలిసి అక్టోబర్ 3 నుంచి పరిశీలించనున్నట్లు కలెక్టర్ కృతికా శుక్లా తెలిపారు. పాతబస్టాండులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భవన్‌ను ఆమె వివిధ శాఖల అధికారులతో కలిసి పరిశీలించారు. జిల్లాకు సంబంధించి ఈవీఎం, వీవీప్యాట్స్ తొలిదశ పరిశీలన ప్రక్రియ 20 రోజుల పాటు జరుగుతుందన్నారు. ఈ ప్రక్రియ నిర్వహించేందుకు స్థానిక అంబేడ్కర్ భవన్‌ను ఎంపిక చేశామన్నారు. బెంగళూరు నుంచి బెల్ కంపెనీకి చెందిన 15 మంది ఇంజినీర్ల బృందం ఈ ప్రక్రియలో పాల్గొంటుందన్నారు. అక్టోబర్ 23 నాటికి ఈ ప్రక్రియ పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలను ఇందులో భాగస్వాముల్ని చేస్తామన్నారు. కలెక్టర్ వెంట డీఆర్వో కె శ్రీధర్‌రెడ్డి, కాకినాడ ఆర్డీవో ఎన్వీవీ సత్యనారాయణ, సోషల్ వెల్ఫేర్ జేడీ డీవీ రమణమూర్తి, అర్బన్ తహసీల్దార్ పి సీతాపతిరావు, ఇతర ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

వలంటీర్ల నియామకానికి నోటిఫికేషన్ విడుదల

కాకినాడ సిటీ: జిల్లాలో వివిధ సచివాలయాల పరిధిలో ఖాళీగా ఉన్న 73 వలంటీర్ల పోస్టుల భర్తీకి మంగళవారం జెడ్పీ సీఈవో రమణారెడ్డి నోటిఫికేషన్ విడుదల చేశారు. అర్హులైన అభ్యర్థులు ఈనెల 21 నుంచి దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తుల స్వీకరణకు చివరి తేదీ ఈనెల 23గా నిర్ణయించామన్నారు. గడువు ముగిసిన వెంటనే ఎంపీడీవోల ఆధ్వర్యంలో కమిటీ అభ్యర్థులకు మౌఖిక పరీక్షలు నిర్వహించి ఎంపిక చేస్తుందన్నారు. గ్రామాల్లో వలంటీర్ల నోటిఫికేషన్ రోస్టర్ ప్రకారం ఖాళీలను భర్తీ చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని సీఈవో వివరించారు.

నవోదయ ప్రవేశానికి దరఖాస్తులు స్వీకరణ

పెద్దాపురం: జవహర్ నవోదయ విద్యాలయం వచ్చే విద్యా సంవత్సరంలో 9, 11 తరగతుల ప్రవేశానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు విద్యాలయం ప్రిన్సిపాల్ కె.రామిరెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన ఈమేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. 9వ తరగతి, 11వ తరగతికి సంబంధించి ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి అక్టోబర్ 31లోగా దరఖాస్తులు సమర్పించాలన్నారు. 9వ తరగతికి ప్రస్తుత విద్యా సంవత్సరంలో 8వ తరగతి విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు అర్హులన్నారు. వీరు 01.05.2009 నుంచి 31.07.2011వ తేదీలోగా జన్మించి ఉండాలన్నారు. 11వ తరగతి ప్రవేశానికి ప్రస్తుత విద్యా సంవత్సరంలో 10వ తరగతి చదువుతూ 01.06.2007 నుంచి 31.07.2009 తేదీలలోగా జన్మించిన విద్యార్థులు అర్హులన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఏదైనా ప్రభుత్వం, లేదా ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో చదివినన వారై ఉండాలన్నారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి 10న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారన్నారు. పూర్తి వివరాలకు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ డాట్ నవోదయ డాట్ జీఓవి డాట్ ఇన్ వెబ్‌సైట్‌ను పరిశీలించాలని ప్రిన్సిపాల్ వివరించారు.

వివాద రహితంగా అటవీ సరిహద్దులు

కాకినాడ సిటీ: రాష్ట్ర ప్రభుత్వం జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకం ద్వారా అత్యంత ప్రతిష్టాత్మకంగా సమగ్ర భూసర్వే, నిర్వహిస్తోందని, ఈ నేపథ్యంలో అటవీ, రెవెన్యూ అధికారులు సమన్వయంతో వ్యవహరించి అటవీ భూముల సరిహద్దుల వద్ద వివాదాలు లేకుండా చూడాలని కలెక్టర్ కృతికా శుక్లా ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా అటవీ కమిటీ, జిల్లా వన్యప్రాణి సంరక్షణ కమిటీ సమావేశాల్లో ఆమె పాల్గొని మాట్లాడారు. అటవీ, రెవెన్యూ, సర్వే, భూ రికార్డుల అధికారులు సంయుక్త బృందాలు కీలకంగా వ్యవహరించాలని ఆదేశించారు. అటవీ, వన్యప్రాణుల సంరక్షణ, పర్యావరణ పరిరక్షణ, జీవవైవిధ్య చట్టాలు పటిష్టంగా అమలయ్యేలా అధికారులు సమన్వయంతో వ్యవహరించాలన్నారు. జిల్లాలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పరివర్తన కార్యక్రమాల వల్ల చాలా వరకు నాటు సారా సమస్య తొలగిందని ఎస్పీ ఎస్ సతీష్‌కుమార్ తెలిపారు. సమావేశంలో జేసీ ఇలక్కియ, డీఎఫ్‌వో ఎస్.భరణి, ఆర్డీవో ఎన్వీవీ సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

బతుకు బండికి భరోసా



సామర్లకోట 27వ వార్డుకు చెందిన అక్కిరెడ్డి సత్తిబాబుకు 16 ఏళ్ల క్రితం పోలియోతో కాళ్లు, చేతులు చచ్చుబడిపోయాయి. భార్య, పిల్లలు సైతం విడిచిపెట్టేశారు. ఎవరైనా ఆదరిస్తే పూట గడిచేది లేదంటే పస్తులతోనే జీవన. దివ్యాంగ పింఛన్ కోసం గతంలో దరఖాస్తు చేసుకున్నా ఫలితం లేదు. ఈనెలలో కొత్తగా దివ్యాంగ పింఛన్ మంజూరై చేతికి రూ.3000 రావడంతో అతని ఆనందానికి అవధులు లేవు. ఎన్నో ఏళ్లుగా రాని పింఛన్ గుమ్మం దాటకుండానే ఇంటి ముంగిటకే రావడం చూసి సత్తిబాబు సంబరపడిపోతున్నాడు. ఇంటింట సర్వేలో దివ్యాంగ సర్టిఫికేటు, రేషన్ కార్డు లేక పోవడాన్ని సచివాలయ సెక్రటరీ, వలంటీర్ గమనించి వాటిని మంజూరు చేయించడంతో పింఛన్ వచ్చిందని తెలిపాడు.

వస్తుందా రాదా అనుకున్నా..



ఆలమూరుకు చెందిన కొండేపూడి విజయలక్ష్మి వయస్సు 47 సంవత్సరాలు. కుమార్తె, కుమారుడు ఉన్నారు. జనవరిలో భర్త సత్యనారాయణ అనారోగ్యంతో మృతిచెందాడు. అప్పటికే కుమార్తెకు పెళ్లి చేసి ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్నారు. కుమారుడు ప్రవీణ్ లారీ డ్రైవర్. అతనికి వచ్చే చాలీచాలని జీతంతో కుటుంబాన్ని నెట్టుకు రావడం కష్టంగా మారింది. పింఛన్ వస్తే కొంత చేదోడుగా ఉంటాదని విజయలక్ష్మి ఆశపడింది. ఎక్కడికి తిరగాల్సిన పని లేకుండా వలంటీర్ వచ్చి దరఖాస్తు చేయించగా కొత్త పింఛన్ మంజూరైంది. ఈనెల 1న వలంటీర్ పింఛన్ సొమ్ము రూ.2750 ఇంటికి తీసుకువచ్చి ఇవ్వడం కొండంత భరోసానిచ్చినట్లు అయ్యిందని విజయలక్ష్మి సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలిపింది.

పేదల బతుకుల్లో పింఛన్ కాంతులు



- అర్హతే ప్రామాణికంగా లబ్ధిదారుల ఎంపిక
- ఒకటో తేదీనే అందిస్తూ ఆర్థిక భరోసా
- గత ప్రభుత్వంలో పింఛన్ల సంఖ్య 2,30,914
- జగన్ ప్రభుత్వంలో లబ్ధిదారులు 2,83,401 మంది
- నాలుగేళ్లలో గణనీయంగా కొత్త పింఛన్లు మంజూరు



సాక్షి ప్రతినిధి, కాకినాడ: ఏ ఆధారం లేని లక్షలాది మంది నిరుపేదలకు పింఛనే జీవనాధారం. అవ్వా, తాతలు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు.. ఇలా ఎందరో జీవితాల్లో పెన్షన్ వెలుగులు నింపుతోంది. పేదరికమే ప్రామాణికంగా అర్హత కలిగిన ప్రతీ ఒక్కరికి ప్రస్తుత ప్రభుత్వం పింఛన్ మంజూరు చేస్తోంది. గత టీడీపీ ప్రభుత్వంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 2,30,914 మంది లబ్ధిదారులకు నెలకు రూ.2,540 కోట్లు సాయం అందేది. జగన్ ప్రభుత్వ సారథిగా పగ్గాలు చేపట్టాక నాలుగేళ్లలో గణనీయంగా కొత్త పింఛన్లు మంజూరు చేశారు. ప్రస్తుతం జిల్లాలో లబ్ధిదారుల సంఖ్య 2,83,401 మందికి పెరిగింది. రూ.7,802 కోట్ల మేర ఆర్థిక సాయం అందజేస్తోంది.

నాడు ఇలా..

టీడీపీ హయాంలో కొత్త పింఛన్ మంజూరవ్వాలంటే జన్మభూమి కమిటీ సభ్యుల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సి వచ్చేది. కమ్యూనిటీహాళ్లు, ఆలయాల వద్ద వృద్ధులు, దివ్యాంగులు పడిగాపులు పడేవారు. ఒక్కోసారి వారం రోజుల వరకు కూడా పెన్షన్ అందేది కాదు. ఇలాంటి బాధలకు సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చరమగీతం పాడారు. అర్హతలున్నా సాంకేతిక కారణాలతో పింఛన్ అందక కష్టాల కడలిలో ఎదురీదుతున్న వారి కోసమే గత నెలలో ప్రత్యేకంగా ద్వైవార్షిక నగదు మంజూరు పథకం తీసుకు వచ్చి అక్కున చేర్చుకున్నారు. దాదాపు అన్ని ఆర్థిక, ఆర్థికేతర అంశాలకు నెల తిరగకుండానే పరిష్కారం చూపించి భరోసా కల్పించారు. ఫలితంగా జిల్లాలో అర్హత కలిగిన ప్రతీ ఒక్కరికి పింఛన్ సాయం అందుతోంది. ప్రతి రెండు మూడు కుటుంబాల్లో పింఛన్ లబ్ధిదారులు ఉంటున్నారు. ఒకటో తేదీన తెల్లారకుండానే ఠంచనుగా గడప చెంతకే వచ్చి పెన్షను నేరుగా వస్తుండటంతో వారి ఆనందానికి అవధులు లేవు.

కాకినాడ జిల్లాలో లబ్ధి (రూ. కోట్లలో..)

గత ప్రభుత్వంలో..		ప్రస్తుత ప్రభుత్వంలో..	
పెన్షన్లు	లబ్ధి	పెన్షన్లు	లబ్ధి
2,30,914	రూ.254.00	2,83,401	రూ.780.20

జనవరి-2021		జూలై-2022		జనవరి-2023		సెప్టెంబర్-2023	
పెన్షన్లు	లబ్ధి	పెన్షన్లు	లబ్ధి	పెన్షన్లు	లబ్ధి	పెన్షన్లు	లబ్ధి
24,936	రూ.56.95	14,713	రూ.38.65	9,898	రూ.27.22	14,063	రూ.38.67

తప్పు సరిచేసి మంజూరు చేశారు



టీడీపీ ప్రభుత్వంలో పింఛను కోసం దరఖాస్తు చేసుకున్నా రాలేదు. నేను నా భార్య కూలి పనులు చేసుకుంటూ పొట్ట పోసుకుంటున్నాం. నాకు సెంటు భూమి లేకపోయినా రెండెకరాలు ఉన్నట్టు రికార్డుల్లో ఉండటంతో పింఛన్ రావడం లేదు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు దృష్టికి నా సమస్య తీసుకువెళ్లాను. ఆన్‌లైన్ నుంచి తొలగించడంతో వృద్ధాప్య పింఛన్ వచ్చింది. అవసరానికి ప్రతి నెలా ఒకటిన రూ.2750లు వస్తాయనే నమ్మకం ఏర్పడింది.

– కొంబత్తుల రామారావు, కొంబత్తులవారిపేట, అంబాజీపేట

ప్రాణం లేచి వచ్చింది



నాకు ముగ్గురు ఆడ పిల్లలు. పెళ్లిళ్లు చేసి అత్తవారిళ్లకు పంపించాను. నా భర్త ఇటీవల కాలం చేయడంతో బతుకు ముందుకు ఎలా సాగుతుందో అర్థం కాని పరిస్థితి. కాయకష్టం చేద్దామన్నా ఆరోగ్యం సహకరించక ఏ పని చేసుకోలేకపోతున్నాను. వలంటీరు ఇంటికి వచ్చి దరఖాస్తు చేయించి పింఛన్ మంజూరు చేయించారు. నా జీవితానికి నెల నెలా వచ్చే పింఛను మొత్తం సరిపోతుంది. జీతం మాదిరిగా ఒకటో తేదీనే వలంటీరు వచ్చి పింఛను ఇస్తున్నారు.

– అల్లవరపు రాము, వృద్ధాప్య పింఛనుదారు, ఇందుగపల్లి, కోటనందూరు మండలం

సత్యదేవుని హుండీ ఆదాయం రూ.2.07 కోట్లు



సత్యదేవుని హుండీ ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది

40 రోజులకు రికార్డు స్థాయి ఆదాయం

అన్నవరం: అన్నవరంలో శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానానికి హుండీల ద్వారా రికార్డు స్థాయిలో రూ.2,07,54,597 ఆదాయం సమకూరింది. దేవస్థానంలో మంగళవారం హుండీలను తెరిచి లెక్కించినట్లు దేవస్థానం ఈఓ చంద్రశేఖర్ అజాద్ తెలిపారు. నగదుతోపాటు 175 గ్రాముల బంగారం, 1,900 గ్రాముల వెండి వచ్చినట్లు పేర్కొన్నారు. ఆదాయంలో నగదు 1,99,78,547 చిల్లర నాణాలు రూ.7,76,050 ఉన్నట్లు తెలిపారు. విదేశీ కరెన్సీ కూడా వచ్చిందన్నారు. దేవస్థానం సిబ్బంది, పురోహితులు, నాయీబ్రాహ్మణులు, స్వచ్ఛంద సేవల సిబ్బంది హుండీ లెక్కింపులో పాల్గొన్నారు. సత్యదేవుని హుండీలను గత నెల 10న లెక్కించారు. ఆ తరువాత మంగళవారం తెరిచారు. శ్రావణ మాసం కావడంతో ఈ 40 రోజుల్లో సత్యదేవుని సన్నిధిన భారీ సంఖ్యలో వివాహాలు జరిగాయి. ఇతర ప్రాంతాల నుంచి కూడా పెద్ద సంఖ్యలో నవదంపతులు, వారితో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. వారంతా స్వామివారి హుండీలలో భారీగా కానుకలు వేయడంతో భారీగా ఆదాయం సమకూరింది.

డయల్ యువర్ కలెక్టర్‌కు 13 అర్జీలు

కాకినాడ సిటీ: డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమంలో వచ్చిన సమస్యల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా జిల్లా అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ ఉదయం 10.30 గంటల నుంచి 11.30 గంటల వరకు డయల్ యువర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లాలో వివిధ ప్రాంతాల నుంచి 13 మంది సంక్షేమ పథకాల లబ్ధి, విద్యా, ఉపాధి, భూ సర్వే, భూ సమస్యలు వంటి సమస్యలపై టోల్‌ఫ్రీ నంబర్ 18004253077కు ఫోన్ చేసి సమస్యలు తెలియజేశారు. ప్రజల సమస్యల్ని నేరుగా తెలుసుకునేందుకు డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమాన్ని ప్రతి మంగళవారం నిర్వహిస్తున్నట్లు కృతికా శుక్లా తెలిపారు. ఈ సమస్యలపై అధికారులు వెంటనే చర్యలు చేపట్టి పరిష్కారించాలని ఆదేశించారు. డీఆర్వో కె శ్రీధర్‌రెడ్డి, ఏవోజీఎస్ఎస్ శ్రీనివాస్, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

త్వరలో సీఎం జగన్ కాకినాడ రాక



స్కేటింగ్ రింక్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డి

సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి వెల్లడి

కాకినాడ: జిల్లా కేంద్రం కాకినాడలో పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించేందుకు త్వరలోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రానున్నారని సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి చెప్పారు. రూ.7 కోట్ల వ్యయంతో అంతర్జాతీయ ప్రమాణాలతో రాజాట్యాంక్ ఆవరణలో నిర్మిస్తున్న ఇండోర్ స్కేటింగ్ రింక్ నిర్మాణ పనులను ఎమ్మెల్యే మంగళవారం పరిశీలించారు. నిర్మాణ ప్రగతిని అడిగి తెలుసుకున్నారు. రింక్ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి నాణ్యతా ప్రమాణాలతో వేగవంతం చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్మార్ట్‌సిటీ నిధులతో నిర్మించిన రాగిరెడ్డి కళాక్షేత్రం, ముత్తా గోపాలకృష్ణ ప్లైఓవర్, స్కేటింగ్ రింక్, ఇతర అభివృద్ధి పనులను సీఎం ప్రారంభిస్తారన్నారు. ఆ మేరకు సీఎం రాక కోసం అవసరమైన కార్యాచరణ సిద్ధం చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, జేసీఎస్ కన్వీనర్ సుంకర విద్యాసాగర్, స్మార్ట్‌సిటీ ఎస్ఈ వెంకట్రావు, మాజీ డిప్యూటీ మేయర్ ఇనుకొండ పట్టాభిరామయ్య, అజ్జు తదితరులు పాల్గొన్నారు.

మెట్టలో క్షీరధారలు

- జగనన్న పాల వెల్లువతో లబ్ధిదారులకు అదనపు లాభాలు
- నెల రోజుల్లో 2 లక్షల లీటర్ల పాలసేకరణ
- 2,435 మందికి రూ.74.50 లక్షల జమ

మండలాలు : 8

గ్రామాలు : 95

మహిళా పాల డెయిరీ సొసైటీలు : 95

రోజువారీ సరాసరి పాల సేకరణ : 6,900 లీటర్లు

పాల సరఫరాదారుల సంఖ్య : 2,435

ఆగస్టు 2 నుంచి 31 మధ్య సేకరించిన పాలు : 2 లక్షల లీటర్లు

నెల రోజుల్లో రైతులకు చెల్లించిన మొత్తం: రూ.74.50 లక్షలు



తుని మండలం వల్లూరులోని పాలు పోస్తున్న పాడి రైతు

తుని రూరల్: మహిళలు ఆర్థిక పరిపుష్టి సాధించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వివిధ రూపాల్లో తోడ్పాటునందిస్తోంది. ఈ క్రమంలోనే రాష్ట్ర ప్రభుత్వం జగనన్న పాల వెల్లువ పథకం ప్రారంభించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా అమూల్ డెయిరీతో ఒప్పందం చేసుకోవడంతో పాల సరఫరాదారులకు అదనపు గిట్టుబాటు ధర లభిస్తోంది. ఇతర డెయిరీలతో పోలిస్తే అమూల్ డెయిరీ లీటరుకు రూ.25 వరకూ అధికంగా చెల్లిస్తోందని పాల సరఫరాదారులు చెబుతున్నారు. దీంతో జగనన్న పాల వెల్లువ పథకం పాడి రైతులను విశేషంగా ఆకర్షిస్తోంది. జిల్లాలోనే తొలిసారిగా తుని మండలం రేఖవానిపాలెం కేంద్రంగా ఎనిమిది మండలాల్లో జగనన్న పాల వెల్లువ పథకం అమలుకు గత నెల మూడో తేదీన శ్రీకారం చుట్టారు. ఈ పథకం కింద రోజువారీ సరాసరి పాల సేకరణ 6,900 లీటర్లు ఉండగా గత నెల 31వ తేదీ వరకూ 2 లక్షల లీటర్ల గేదె, ఆవు పాలు సేకరించారు. ఇందుకుగాను 2,435 మంది పాల సరఫరాదారులకు రూ.74.50 లక్షల మొత్తాన్ని అమూల్ సంస్థ చెల్లించింది. డెయిరీ ఏర్పాటు చేసిన వంద రోజుల్లో రోజువారీ పాల సేకరణలో 10 వేల లీటర్ల స్థాయికి చేరుకుంటామని అమూల్ నిర్వాహకులు పేర్కొన్నారు.

తుని సమీపాన బీఎంసీ యూనిట్

అమూల్ డెయిరీ తుని మండలం రేఖవానిపాలెం వద్ద 50 వేల లీటర్ల నిల్వ సామర్థ్యంతో బల్క్ మిల్క్ కూలింగ్ యూనిట్ ఏర్పాటు చేసింది. తుని, కోటనందూరు, తొండంగి, రౌతులపూడి, శంఖవరం, పిఠాపురం, గొల్లప్రోలు, ఉప్పాడ కొత్తపల్లి మండలాల్లోని 95 గ్రామాల్లో స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జీ) ఆధ్వర్యాన మహిళా పాల డెయిరీ సొసైటీలు ఏర్పాటు చేశారు. వీటి ద్వారా జగనన్న పాల వెల్లువ పథకానికి శ్రీకారం చుట్టారు. మొదటి రోజు 1,227 లీటర్ల పాల సేకరణతో ప్రారంభం కాగా, నెల రోజుల్లోనే 6,900 లీటర్ల సరాసరికి చేరుకుంది. పాల సరఫరాదారులకు పది రోజులకోసారి చొప్పున నెలకు మూడు విడతలుగా చెల్లింపులు జరుపుతున్నామని నిర్వాహకులు తెలిపారు. గరిష్టంగా లీటరు గేదె పాలకు రూ.97.75, ఆవు పాలకు రూ.43.70 చొప్పున లభించిందని సరఫరాదారులు చెప్పారు. ఇతర ప్రైవేటు డెయిరీల కంటే అమూల్ డెయిరీ లీటరు పాలకు రూ.10 నుంచి రూ.25 వరకూ అదనంగా చెల్లిస్తోందని పాడి రైతులు గుర్తించారు.

ఎస్‌హెచ్‌జీ సభ్యులకు ప్రాధాన్యం

మహిళలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు ప్రభుత్వం, అమూల్ సంస్థ సంయుక్తంగా జగనన్న పాల వెల్లువ కార్యక్రమానికి శ్రీకారం చుట్టాయి. గ్రామ స్థాయి పాల డెయిరీల్లో ఎస్‌హెచ్‌జీలకు ప్రాధాన్యం కల్పించారు. గ్రామాల్లో ఎస్‌హెచ్‌జీ సభ్యుల ఆధ్వర్యాన పాల డెయిరీ సొసైటీలు ఏర్పాటు చేసి పాల కేంద్రాల నిర్వహణ, పాల సేకరణ బాధ్యతలను అప్పగించారు. సొసైటీల సమన్వయానికి సూపర్‌వైజర్‌గా ఎస్‌హెచ్‌జీ సభ్యురాలినే నియమించారు. దీంతో జగనన్న పాల వెల్లువ పథకం మెట్టలో విజయవంతంగా నడుస్తోంది.

కష్టానికి ప్రతిఫలం దక్కుతోంది



మాకు రెండు ఆవులు, రెండు గేదెలు ఉన్నాయి. పూటకు 22 లీటర్ల పాలు వస్తున్నాయి. గతంలో ప్రైవేటు డెయిరీకి పాలు పోశాం. ఇప్పుడు అమూల్ డెయిరీకి పోస్తున్నాం. గతంతో పోల్చుకుంటే వెన్న శాతం పెరగడంతో గిట్టుబాటు ధర అధికంగా లభిస్తోంది. కష్టానికి ప్రతిఫలం దక్కుతోంది. 15 ఏళ్లగా పాడి పశువుల పెంపకం, వ్యవసాయంతో జీవనం సాగిస్తున్నాం.

– అన్నంరెడ్డి అర్థమ్మ, పాడి రైతు, ఎస్ఆర్ పేట, కోటనందూరు మండలం

పారదర్శకంగా నిర్వహణ



పాల సేకరణలో పారదర్శకత పాటిస్తున్నాం. సరఫరాదారుల సమక్షంలోనే కంప్యూటరైజ్డ్ మెషీన్‌పై తూకం వేస్తున్నాం. పాలల్లో వెన్న శాతం ఎంత, ఎన్ని లీటర్లో స్పష్టంగా తెలియజేస్తూ కంప్యూటర్ రశీదు ఇస్తున్నాం. ఆవు పాలు, గేదె పాలు కలిసిపోకుండా ఎప్పటికప్పుడు యంత్రాలను శుభ్రపరచుతున్నాం. సేకరించిన పాలకు అమూల్ డెయిరీ పది రోజులకోసారి రైతులకు చెల్లింపులు చేస్తోంది.

– కుర్ర కృష్ణకుమారి, పాల సేకరణ కేంద్రం నిర్వాహకురాలు, వల్లూరు, తుని మండలం

దీంతో పాల సరఫరా క్రమంగా పెరుగుతోందని సొసైటీల నిర్వాహకులు తెలిపారు. అమూల్ డెయిరీ అధికారులు, పశువైద్యాధికారులు గ్రామాల్లో పర్యటించి జగనన్న పాల వెల్లువ పథకంపై పాడి రైతుల్లో అవగాహన కల్పిస్తున్నారు. అదనపు గిట్టుబాటు ధర ఎలా అందిస్తున్నారో వివరిస్తున్నారు.

క్లుప్తంగా

గుర్తు తెలియని వ్యక్తి మృతి

ఆలమూరు: జొన్నాడ సెంటర్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి (70) మృతి చెందాడు. స్థానికుల కథనం ప్రకారం ఆ వ్యక్తి కొంత కాలం నుంచి జొన్నాడ పరిసర ప్రాంతాల్లో భిక్షాటన చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కొద్ది రోజులుగా అతడికి మతిస్థిమితం లేదని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఆరోగ్యం క్షీణించి తారకరామా కాలనీ సమీపాన మంగళవారం అతడు మృతి చెందాడు. స్థానికులు సమాచారం ఇవ్వడంతో ఎస్సై ఎల్ శ్రీను నాయక్ సిబ్బందితో కలిసి హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకున్నారు. గ్రామ పంచాయతీ సిబ్బంది సహకారంతో మృతదేహాన్ని శ్మశాన వాటికకు తరలించి దహన సంస్కారాలు నిర్వహించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

గండేపల్లిలో..

గండేపల్లి: జాతీయ రహదారి పక్కన గుర్తు తెలియని వృద్ధుడి (70) మృతదేహాన్ని పోలీసులు మంగళవారం గుర్తించారు. వారి కథనం ప్రకారం.. గండేపల్లి శివారున విశాఖ వైపు వెళ్లే రోడ్డు పక్కన ధాబా వద్ద ఈ మృతదేహాన్ని గుర్తించారు. మృతదేహంపై ఎరుపు రంగు టీ షర్ట్, లేతరంగు నైట్ ఫ్యాంట్ ఉన్నాయి. వీఆర్ఓ కృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై గణేష్‌కుమార్ తెలిపారు. మృతుని ఆచూకీ తెలిసినవారు 08852–294100, 94409 04841 నంబర్లకు సమాచారం అందించాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో మోటార్ సైక్లిస్ట్ మృతి

రాయవరం: రోడ్డు ప్రమాదంలో మోటార్ సైక్లిస్ట్ మృతి చెందిన సంఘటన రాయవరం మండలం పసలపూడి వద్ద చోటు చేసుకుంది. రామచంద్రపురం మండలం వెలంపాలెం శివారు కుండాలమ్మ చెరువు ప్రాంతానికి చెందిన పంపన శ్రీను (33) పసలపూడిలో అత్తవారింటి వద్ద భార్యా పిల్లలతో కలిసి నివాసం ఉంటున్నాడు. సోమవారం రాత్రి మోటార్ సైకిల్‌పై వెళ్తున్న అతడు పసలపూడి వద్ద ఆగి ఉన్న మరో బైక్‌ను ఢీకొట్టాడు. అనంతరం తనకేమీ కాలేదంటూ ఇంటికి వెళ్లి నిద్రించాడు. మంగళవారం తెల్లవారుజామున ఊపిరి పీల్చుకోవడం కష్టమవడంతో భార్య ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలోనే శ్రీను మరణించాడు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై జి.నరేష్ తెలిపారు.

పంచ్ కొడితే పతకమే..

- బాక్సింగ్‌లో రాణిస్తున్న పేదింటి క్రీడాకుసుమం
- జాతీయ, రాష్ట్ర స్థాయిల్లో అనేక పతకాలు
- ప్రపంచ, కామన్‌వెల్త్ బాక్సింగ్ పోటీలకు సిద్ధమవుతున్న నస్రీనా
- ప్రభుత్వ సాయం కోసం ఎదురుచూపులు



నేపాల్‌లో జరిగిన పోటీల్లో ప్రత్యర్థికి పంచ్ కొడుతున్న నస్రీనా



సాధించిన పతకాలతో బాక్సింగ్ క్రీడాకారిణి షేక్ నస్రీనా

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): ఆ అమ్మాయి బరిలోకి దిగితే పతకం సొంతం కావల్సిందే.. పంచ్ కొడితే ప్రత్యర్థి బెంబేలెత్తాల్సిందే.. ప్రతిభకు పేదరికం అడ్డం రాదని నిరూపించింది షేక్ నస్రీనా. బాక్సింగ్ బరిలో ప్రత్యర్థులను తన కిక్‌తో గడగడలాడించి 15 బంగారు, 2 రజత పతకాల్ని తన ఖాతాలో వేసుకుంది. జాతీయ, అంతర్జాతీయ క్రీడల్లో రాణిస్తోంది. ప్రతిభకు తగిన ప్రోత్సాహం లేక ప్రభుత్వ సాయం కోసం ఎదురు చూపులు చూస్తోంది. ప్రభుత్వ తోడ్పాటు ఉంటే జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మరిన్ని పతకాలు సాధిస్తానని ధీమాగా చెబుతోంది. ఆమె పేరు షేక్ నస్రీనా. ఊరు రాజమహేంద్రవరం. ఆ నగరంలోని ఐఎల్‌టీడీ ప్రాంతానికి చెందిన నస్రీనా తండ్రి షేక్ మస్తాన్ చిరు వ్యాపారం చేస్తుంటారు. తల్లి షేక్ మీరా టైలరింగ్ చేస్తూ ఆయనకు చేదోడు వాదోడుగా ఉంటున్నారు.

బాక్సింగ్‌లో ఓనమాలు ఇలా..

నస్రీనా చిన్నాన్న హైదరాబాద్‌లో ఉంటారు. ఆయన ఇంటికి 2014లో వెళ్లిన ఆమె.. అక్కడ తన ఈడు పిల్లలు వివిధ క్రీడల్లో రాణించడం చూసి స్ఫూర్తి పొందింది. బాక్సింగ్‌లో విశ్వవిజేత టైసన్ పోరాడటాన్ని టీవీల్లో చూసి ఈ క్రీడపై ఆసక్తి పెంచుకుంది. ఆడపిల్లలకు క్రీడలు ఎందుకని ఇరుగుపొరుగు వారు నిరుత్సాహపరిచారు. కానీ కుమార్తె కోరికను తల్లిదండ్రులు అంగీకరించారు. దీంతో నస్రీనా హైదరాబాద్‌లో చిన్నాన్న ఇంటి వద్దనే ఉండి తొమ్మిదో తరగతి చదువుతూ, ఎల్‌బీ స్టేడియంలో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (శాప్) బాక్సింగ్ కోచ్ ఓంకార్ యాదవ్ వద్ద ఈ క్రీడలో ఓనమాలు నేర్చుకుంది. తరువాత తల్లిదండ్రులు రాజమహేంద్రవరంలో ఉండటంతో హైదరాబాద్ నుంచి ఇక్కడకు వచ్చేసింది. జిల్లాకు చెందిన అంతర్జాతీయ బాక్సింగ్ కోచ్ చిట్టూరి చంద్రశేఖర్ వద్ద శిక్షణకు చేరింది. నస్రీనా పట్టుదల, ఆట పట్ల ఆసక్తి, చలాకీతనాన్ని గుర్తించిన చంద్రశేఖర్ ఆమెకు బాక్సింగ్‌లో మెళకువలు నేర్పించారు. కౌంటర్ ఎటాక్, మిక్సింగ్, ఫుట్‌వర్క్, స్పీడ్, స్టామినా, ఫిట్‌నెస్‌లో ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం రెండేసి గంటల చొప్పున శిక్షణ ఇచ్చి, మేటి క్రీడాకారిణిగా తీర్చిదిద్దారు. దీంతో తొమ్మిదో తరగతి నుంచే నస్రీనా పాఠశాల స్థాయి పోటీల్లో పాల్గొని పతకాలు సాధించడం మొదలు పెట్టింది. శాప్ ఆధ్వర్యాన నిర్వహించిన రాష్ట్ర స్థాయి వేసవి శిక్షణ శిబిరంలో పాల్గొని మరిన్ని మెళకువలు నేర్చుకుంది. కుటుంబ ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రం కావడంతో రాజమహేంద్రవరానికే చెందిన సినీ నటుడు ఆలీ, మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్‌లు నస్రీనా శిక్షణకు కొంత ఆర్థిక సహాయం అందించి, ప్రోత్సహించారు. ప్రస్తుతం నస్రీనా రాజమహేంద్రవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీ ఆఖరి సంవత్సరం చదువుతోంది. అలాగే త్వరలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరచి కామన్‌వెల్త్, ప్రపంచ బాక్సింగ్ పోటీలకు ఎంపికయ్యేందుకు ఢిల్లీలో అంతర్జాతీయ కోచ్, ఒలింపియన్ హయతుల్లా నైబీ వద్ద శిక్షణ పొందుతోంది.

ఒలింపిక్స్‌లో బంగారు పతకం సాధిస్తా..

బాక్సింగ్ నేర్చుకుంటున్న తొలి రోజుల్లో కంటిపై గాయం కావడంతో వద్దన్న అమ్మానాన్న ఇప్పుడు నన్ను ప్రోత్సహిస్తున్నారు. నా కుటుంబ ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే. అంతర్జాతీయ పోటీల ఎంపికకు తీసుకునే శిక్షణకు ప్రభుత్వం తగిన ఆర్థిక సహాయం అందిస్తే ఒలింపిక్స్‌లో తప్పకుండా బంగారు పతకం సాధిస్తాను.

– షేక్ నస్రీనా

ప్రోత్సాహం అందిస్తే పతకం ఖాయం

నేను తొలి నుంచీ కుస్తీ పోటీల్లో పాల్గొనేవాడిని. ఆడపిల్లలకు కుస్తీ పోటీలు ఎందుకులే అనుకున్న తరువాత నస్రీనాలో ఉన్న ఉత్సాహం చూసి ప్రోత్సహించాం. ఇప్పుడు ఎన్నో బంగారు పతకాలు సాధిస్తోంది. సామాన్య కుటుంబం కావడంతో నస్రీనాకు సరైన ఆహారం, ఇతర సౌకర్యాలు అందించలేకపోతున్నాం. నస్రీనాకు ప్రభుత్వం తగిన ప్రోత్సాహం అందిస్తే దేశానికి బంగారు పతకం తీసుకురావడం ఖాయం.

– షేక్ మస్తాన్, షేక్ నస్రీనా తండ్రి

సాధించిన విజయాలు



తల్లి షేక్ మీరాతో నస్రీనా

- మధురైలో జరిగిన ఇండియన్ అమెచ్యూర్ బాక్సింగ్ ఫెడరేషన్ పోటీల్లో బంగారు పతకంతో పాటు బెస్ట్ బాక్సర్ పతకం.
- ఏడు రాష్ట్రాల మహిళల సౌత్ జోన్ పోటీల్లో 64, 66 కేజీల విభాగాల్లో బంగారు పతకం.
- అంతర్జాతీయ స్థాయిలో నేపాల్ రాజధాని ఖాట్మండులో జరిగిన బాక్సింగ్ పోటీల్లో పసిడి పతకం.
- 2021లో మహారాష్ట్రలోని పుణేలో జరిగిన ప్రొఫెషనల్ బాక్సింగ్ పోటీల్లో బంగారు పతకం.
- 2022లో జరిగిన ఏపీ స్టేట్ సీనియర్ బాక్సింగ్ పోటీలో రెండు పతకాలు సాధించి జాతీయ స్థాయికి ఎంపిక.
- ఇటీవల తిరుపతిలో జరిగిన ఏపీ సీఎం కప్ బాక్సింగ్ పోటీల్లో బంగారు పతకం.



బాక్సింగ్ పంచ్ పొజిషన్‌లో క్రీడాకారిణి నస్రీనా

పూటుగా తాగి.. యువకులతో వాగ్వాదం

ఘర్షణలో ఆటో డ్రైవర్ మృతి

కాకినాడ క్రైం: మద్యం మత్తులో నోరు జారిన ఘటనలో ఓ తాగుబోతు ముగ్గురు వ్యక్తుల చేతిలో దాడికి గురయ్యాడు. ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందాడు. వివరాలివీ.. కాకినాడ నూకాలమ్మ మాన్యానికి చెందిన ఆటో డ్రైవర్ నీలపు నాగరాజు (46) మద్యానికి బానిసయ్యాడు. భానుగుడి జంక్షన్ నుంచి రైల్వే స్టేషన్‌కు వెళ్లే మార్గంలోని ప్రకాశం వీధిలో ఉన్న ఓ టీ దుకాణం వద్ద సోమవారం సాయంత్రం మద్యం మత్తులో టీ ఆర్డర్ చేశాడు. ఆ సమయంలో అక్కడికి ఇద్దరు యువకులు వచ్చారు. వారిని టైం ఎంతైందని అడిగాడు. వారు చెప్పేసరికి వినిపించలేదంటూ గదమాయించాడు. మళ్లీ చెప్పమంటూ దూషించాడు. యువకులు స్పందించకపోయేసరికి అసభ్య పదజాలంతో దూషించాడు. దీంతో ఇరు వర్గాల మధ్య వాదులాట జరిగింది. మరో వ్యక్తి జోక్యం చేసుకొని, మద్యం మత్తులో ఉన్న నాగరాజును తప్పు చేస్తున్నావంటూ వారించి అతడి ఆటోలో ఎక్కించాడు. ఆటోలో ఉన్న నాగరాజు మళ్లీ దూషిస్తుండటంతో ఆ ఇద్దరు యువకుల్లో ఒకరు తన సోదరుడికి విషయం చెప్పాడు. అతడు అక్కడికి చేరుకున్నాడు. అప్పటికే ఆటో దిగి అరుస్తున్న నాగరాజుపై ముగ్గురు యువకులూ దాడి చేశారు. నాగరాజు కింద పడిపోవడంతో వారు అక్కడి నుంచి వెళ్లిపోయారు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా.. టూ టౌన్ సీఐ నాగేశ్వర్ నాయక్ తన సిబ్బందితో అక్కడికి చేరుకుని, నాగరాజును జీజీహెచ్‌కు తరలించారు. అయితే, అప్పటికే అతడు మరణించినట్లు వైద్యులు నిర్ధారించారు. నాగరాజుకు గతంలో ద్విచక్ర వాహన ప్రమాదం జరగడంతో రెండుసార్లు మెదడుకు సంబంధించిన శస్త్రచికిత్స జరిగిందని, కపాల భాగం బలహీనంగా ఉందని వైద్యులు చెప్పారు. దాడికి పాల్పడిన యువకులు విజయ్, శేఖర్‌తో పాటు మరో బాలుడిని అదుపులోకి తీసుకున్నట్టు సీఐ నాయక్ తెలిపారు.

భార్య చేతిలో హతం

- చెంపపై కొట్టడంతో మృతి చెందిన భర్త
- పాశర్లపూడి బాడవలో ఘటన



సాయికుమార్ మృతదేహం

మామిడికుదురు: పండగ వేళ పాశర్లపూడి బాడవలో దారుణం చోటు చేసుకుంది. వివాహేతర సంబంధం నేపథ్యంలో జరిగిన ఘర్షణలో భార్య చేతిలో భర్త హత్యకు గురయ్యాడు. వివరాలివీ.. పాశర్లపూడి బాడవ పల్లవపాలేనికి చెందిన కొల్లు సాయికుమార్ (24).. అదే గ్రామానికి చెందిన యువతిని ఐదేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నాడు. వీరికి ఇద్దరు కుమార్తెలు. సాయికుమార్ ఇళ్ల సీలింగ్ పనులు నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇదిలా ఉండగా.. అతడి భార్య.. అదే గ్రామానికి చెందిన కొల్లు వెంకటేష్‌తో వివాహేతర సంబంధం పెట్టుకుంది. ఈ నేపథ్యంలో భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. ఇదే విధంగా ఈ నెల 17వ తేదీ రాత్రి ఇద్దరి మధ్యా ఘర్షణ జరిగింది. ఈ క్రమంలో సాయికుమార్ చెంపపై భార్య గట్టిగా కొట్టడంతో అతడు మృతి చెందాడు. ఈ మేరకు హతుని తండ్రి కొల్లు వీరపండు నగరం పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశారు. ఈ సంఘటన స్థానికంగా కలకలం రేపింది. ఈ సంఘటనపై పి.గన్నవరం సీఐ ప్రశాంత్‌కుమార్ ఆధ్వర్యాన నగరం ఎస్సై పి.సురేష్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. సాయికుమార్ మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.



లక్ష్మీగణపతి స్వామి సన్నిధిలో అనపర్తి ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి



అయినవిల్లి మాడ వీధుల్లో సాగుతున్న స్వామి వారి ఊరేగింపు

వినాయక వైభవం

- ఘనంగా చవితి మహోత్సవాలు
- కిక్కిరిసిన అయినవిల్లి, బిక్కవోలు ఆలయాలు

అయినవిల్లి/బిక్కవోలు: 'జై గణేశ' అంటూ భక్తిపారవశ్యంతో భక్తులు చేసిన నినాదాలు ప్రతిధ్వనించాయి. వినాయక చవితి నవరాత్ర మహోత్సవాలు కన్నుల పండువగా సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ప్రసిద్ధ గణేశ క్షేత్రాలైన అయినవిల్లి, బిక్కవోలు ఆలయాలకు భక్తులు పోటెత్తారు. స్వామి వారికి కానుకలు, మొక్కుబడులు చెల్లించారు. అయినవిల్లి విఘ్నేశ్వర స్వామిని సోమ, మంగళవారాల్లో అధిక సంఖ్యలో భక్తులు దర్శించారు. ప్రధానార్చకుడు అయినవిల్లి సూర్యనారాయణమూర్తి ఆధ్వర్యాన 12 మంది పండితులు వివిధ పండ్ల రసాలు, పంచామృతాలతో స్వామివారిని విశేషంగా అభిషేకించారు. లక్ష దూర్వర్చన, నిత్య లక్ష్మీగణపతి హోమం వంటి విశేష క్రతువులు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో పండితులు మట్టి గణపతిని ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు జరిపారు. కార్యక్రమాలను ఆలయ చైర్మన్ గుత్తుల నాగేశ్వరరావు (నాగబాబు), ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు (సతీష్‌రాజు) పర్యవేక్షించారు. స్వామివారిని సాయంత్రం మాడ వీధుల్లో ఊరేగించారు. పంచహారతులు ఇచ్చారు. ఉత్సవాల సందర్భంగా స్వామివారిని, ఆలయ ప్రాంగణాన్ని వివిధ పుష్పమాలికలు, విద్యుద్దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి.

బిక్కవోలులోని ప్రాచీన క్షేత్రం శ్రీ లక్ష్మీగణపతి స్వామి ఆలయంలో వినాయక చవితి వేడుకలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం నుంచి భారీ క్యూలలో వేచి ఉండి మరీ స్వామి వారిని వేలాదిగా భక్తులు దర్శించుకున్నారు. సోమవారం వేకువన 1.29 గంటలకు తీర్థపు బిందె సేవతో వేడుకలు ప్రారంభమయ్యాయి. శ్రీ లక్ష్మీ గణపతి ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ తమ్మిరెడ్డి నాగ శ్రీనివాసరెడ్డి పర్యవేక్షణలో ఈ ఉత్సవాలకు సోమవారం ఉదయం 10.46 గంటలకు ఏఎంసీ మాజీ చైర్మన్, వైఎస్సార్ సీపీ నాయకుడు జంగా వీర వెంకట సుబ్బారెడ్డి, విశాలక్షి దంపతులు కలశ స్థాపన చేశారు. ఈ సందర్భంగా లక్ష్మీ గణపతి స్వామిని విశేషంగా అలంకరించారు. స్వామి వారిని అనపర్తి ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారిని దర్శించుకున్న ప్రముఖుల్లో రాజమహేంద్రవరం నగరాభివృద్ధి సంస్థ మాజీ చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి, హితకారిణి సమాజం డైరెక్టర్ వుండు సత్యనారాయణ, ఈఓ రామలింగ భాస్కర్ తదితరులున్నారు.



బిక్కవోలులో కిక్కిరిసిన భక్తులు



ప్రత్యేక అలంకరణలో అయినవిల్లి విఘ్నేశ్వర స్వామి



అయినవిల్లిలో విఘ్నేశ్వరుని దర్శనానికి క్యూ కట్టిన భక్తులు

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

జగ్గంపేట: ప్రమాదంలో గాయపడి, చికిత్స పొందుతున్న ఒక వ్యక్తి మృతి చెందాడు. హెడ్ కానిస్టేబుల్ రామకృష్ణ కథనం ప్రకారం.. నరేంద్రపట్నం గ్రామానికి చెందిన కండిపల్లి లోవరాజు (34) సోమవారం జగ్గంపేటలోని తన బావగారి కుమారుడి పుట్టిన రోజు వేడుకకు తన బావమరిది టంకు పైడియ్యతో కలిసి మోటార్ సైకిల్‌పై వెళ్లాడు. తిరిగి వస్తుండగా నరేంద్రపట్నం శివారున వారి మోటార్ సైకిల్ ఆగిపోయింది. చీకట్లో దాన్ని మరమ్మతు చేస్తుండగా, నరేంద్రపట్నం నుంచి మరో మోటార్ సైకిల్‌పై వస్తున్న వ్యక్తి లోవరాజును బలంగా ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో లోవరాజు తలకు తీవ్రగాయాలయ్యాయి. అతడిని బావమరిది పైడియ్య, కుటుంబ సభ్యులు కలిసి ఏలేశ్వరం ఆసుపత్రికి హుటాహుటిన తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ లోవరాజు మంగళవారం మృతి చెందాడు. మృతుడి భార్య రూపవతి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ట్విన్.. ఫన్



కొబ్బరి కాయను కొడితే రెండు చిప్పలవ్వడం సర్వసాధారణం. అదే కొబ్బరి కాయలో నాలుగు చిప్పలుండటం వింతే కదా! మాచవరం గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ రాజరాజేశ్వరీ పార్వతీ సమేత పరమేశ్వర స్వామి వారిని ఓ భక్తుడు దర్శించుకున్నాడు. అభిషేకానికి ఆయన ఇచ్చిన కొబ్బరి కాయను అర్చకుడు మాచరి రాజు రెండు ముక్కలుగా కొట్టగా.. అందులో నాలుగు కొబ్బరి చిప్పలు దర్శనమిచ్చాయి. దీనిని భక్తులు ఆసక్తిగా తిలకించారు. ఇటువంటి కాయలను ట్విన్ కోకోనట్ అంటారని అంబాజీపేటలోని డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన పరిశోధన కేంద్రం అధిపతి డాక్టర్ ఎన్‌బీవీ చలపతిరావు చెప్పారు. కొబ్బరిలో సాధారణంగా డబుల్ ఫలదీకరణ ప్రక్రియలో డిప్లాయిడ్ పిండం, ట్రిప్లాయిడ్ ఎండోస్పెర్మ్ ఉన్న విత్తనాలు ఉంటాయని తెలిపారు. కొన్నిసార్లు ఉత్పరివర్తన లేదా జన్యుపరమైన తేడాల వలన ఇటువంటి కొబ్బరి కాయలు తయారవుతాయని చెప్పారు.

- అంబాజీపేట

అందిన 'ద్రాక్ష'.. తియ్యన..

'అందని ద్రాక్ష పుల్లన' అంటారు. కానీ చేతికి అందుతున్న ఈ ద్రాక్ష చాలా తియ్యగా ఉంది. అంబాజీపేట మండలం మాచవరంలో 'పళని స్వామి గోలీ సోడా' పేరుతో పద్దెనిమిది రకాల సోడాలు విక్రయించే వక్రే రామకృష్ణ ఇంటి వద్ద ఈ ద్రాక్ష పాదు సుమారు 10 మీటర్ల పొడవున పెరిగింది. షాపునకు స్వాగత లతలా అల్లుకున్న ఈ ద్రాక్ష పాదు గుత్తులు గుత్తులుగా కాపు కాస్తూ ఇక్కడకు వస్తున్న సోడా ప్రియులను, రోడ్డు మీద వెళ్లేవారిని ఆకర్షిస్తోంది. ద్రాక్షను పెంచేందుకు కోనసీమ జిల్లాలో అనుకూల వాతావరణం ఉంటుంది. అయినప్పటికీ చాలా మంది సరదాగా దీనిని పెంచుతారు. కానీ, ఇక్కడ పెరిగే ద్రాక్ష పుల్లగా, చేదుగా ఉంటుంది. అయితే, రామకృష్ణ ఇంటి వద్ద పెరిగిన ద్రాక్ష మాత్రం తియ్యగా ఉండటం విశేషం. 'మా ఇంటి పక్కవారి వద్ద ఉన్న పాదుకు అంటు కట్టాను. వారికి ద్రాక్ష కాయలేదు కానీ నా వద్ద ఉన్న పాదుకు పెద్ద సంఖ్యలో ద్రాక్ష గుత్తులు కాయడం సంతోషంగా ఉంది' అని రామకృష్ణ ఆనందంగా చెప్పారు.

- సాక్షి, అమలాపురం

